ప్రజాశక్తి

ఆదివారం 21 జనవరి 2024

5

పార్వతీపురం మన్యం

అరకులో నిర్వహించిన రా కదలిరా కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిసిన కురుపాం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు తోయక జగదీశ్వరి, గుమ్మడి సంధ్యారాణి, బోనెల విజయ్ చంద్ర, జయకృష్ణ. -ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాంలో రాస్తారోకో చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు

అంగన్వాడీలకు మద్దతుగా

ప్రజాసంఘాల రాస్తారోకో

- మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్న ఆందోళనలు
- 40వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీలు చేపట్టిన దీక్ష ప్రభుత్వానికి కనిపించడం లేదానని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం కురుపాంలో జరుగుతున్న అంగన్వాడీల దీక్ష శిబిరానికి వెళ్లి అక్కడ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు పండగల సైతం లెక్కచేయకుండా కుటుంబాలను విడిచిపెట్టి వారి హక్కులపై శాంతియుతంగా దీక్ష చేపట్టి 40 రోజులవుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదన్నారు. తిరిగి వారిపై ఎస్మా ప్రయోగించడమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల న్యాయమైన హక్కులు తీర్చే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, కొల్లి గంగునాయుడు, పువ్వల తిరుపతిరావు, కూరంగి సీతారాం, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళకుమారి, ప్రాజెక్ట్ కార్యదర్శి జె.సరోజ, కురుపాం, జియ్యమ్మవలస మండలాల అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాచిపెంట : అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సిఐటియు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పాచిపెంటలో రాస్తారోకో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బోను గౌరునాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సూకురు రామారావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఎన్నికల సమయంలో తెలంగాణా కన్నా అదనంగా వెయ్యి రూపాయలు ఇస్తామన్న ముఖ్యమంత్రి హామీ అమలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, లేకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే చలో విజయవాడ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని హెచ్చరించారు.

గరుగుబిల్లి : అంగన్వాడీల న్యాయమైన పోరాటానికి మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటనాయుడు, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబూరావు, అంగన్వాడి యూనియన్ నాయకులు సావిత్రి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : తమ పట్ల ప్రభుత్వం కవ్వింపు చర్యలు మానుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు నారయణమ్మ, శశికళ హెచ్చరించారు. యూనియన్ ఆధ్వర్యాన స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బోసు బొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంక్షన్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు ఆమోదించకుండా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. జీతాలు పెంచి ఉద్యోగభద్రత కల్పించినప్పుడే సమ్మె విరమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, యూనియన్ నాయకులు సుభద్ర, గౌరీశ్వరి, ఇందిరకుమారి, జానకి, పోలమ్మ, మరియమ్మ, రాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : అంగనవాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక దీక్షలకు మద్దతుగా సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, వీరిపై దుష్ప్రచారాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కె.రాము ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సిఐటియు నాయకులు దూసి దుర్గారావు, మజ్జి వీరంనాయుడు, బి.శివ, మజ్జి రామారావు, చింతల సంజీవి, యడ్ల శ్రీనివాసరావు, వై.సింహాచలం, అంగన్‌వాడీ నాయకులు బి.అమరవేణి, హిమప్రభ, శారద, సీత, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: సీతంపేటలో అంగన్‌వాడీలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మండంగి కాంతారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి లక్ష్మణరావు, సీనియర్ నాయకులు పాలక సాంబయ్య, మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకలు దర్శిమి, పార్వతి, అంజలి, పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి వెంకటరమణ, రైతు సంఘం మండల అధ్యక్షులు బి.అప్పారావు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్.రాము, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్-ఎస్ సునీత, శైలజ, డి.అరుణ, జయలక్ష్మి కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. కొమరాడలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఇందిర, కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ సమస్యలు పరిష్కరించకపోగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు టి.శ్రీకర్, ఎం.రామకృష్ణ, గౌరీశంకర్, ఎపి గిరిజన సంఘము జిల్లా నాయకులు రామారావు, రామస్వామి, లక్ష్మణ్, ఐద్వా నాయకులు మంగమ్మ, లక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు బి.గోపి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మనాయుడు, రైతు సంఘం నాయకులు వెంకట్రావు పాల్గొన్నారు.

పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న ప్రజా, కార్మికసంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం : తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలని గత 40 రోజులుగా అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తున్న నేటి వరకు కనీసం పరిష్కార మార్గం చూపకపోవడం విచారకరమని ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బ లోవరాజు అన్నారు. గుమ్మ లక్ష్మీపురంలో శనివారం అంగనవాడీలు ఎల్విన్ పేట కూడలి వద్ద ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు తమ న్యాయమైన కోరికల పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మెలో పాల్గొని అసువులు బాసిన కోనసీమ జిల్లా అంగన్వాడీ వర్కర్ కొత్తపల్లి శాంతి కుమారి మృతికి పార్వతీపురం అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి ఆధ్వర్యంలో శనివారం నివాళులు అర్పించారు. 40వరోజు సమ్మె శిబిరంలో, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ప్రాజెక్టు లీడర్స్ మర్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, సిఐటియు పట్టణ నాయకులు బొత్స లక్ష్మి, రాజేశ్వరి, బి.శాంతి, ఎం.గౌరీ, జయలక్ష్మి, రాజేశ్వరి, పార్వతమ్మ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు పాల్గొన్నారు.

బలిజిపేట: అంగనవాడీలు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలియజేస్తూ సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, రైస్ మిల్ కార్మికులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా జీతభత్యాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంజరపు సత్యనాయడు,భానుమూర్తి, నల్ల ఈశ్వరరావు, పి.అప్పారావు, ఆనంద్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ, సీతంపేట, సాలూరు, సీతానగరంలో రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు అంగన్‌వాడీలు

రిపబ్లిక్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిఒ కల్పనాకుమారి అన్నారు. శనివారం గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై ఐటిడిఎలోని అన్ని శాఖల సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వేడుకలకు హాజరయ్యే వారికి తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. దేశభక్తి ప్రతిబింభించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐటిడిఎ ఆవరణ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రదానం చేసే ప్రశంసా అవార్డుల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, ఇఇ సింహాచలం, జిసిసి డిఎం సంధ్యారాణి, పిఎఒ హరికృష్ణ, పిహెచ్‌ఒ గణేష్, ఎఒ విజయరాణి, డిప్యూటీ ఇఒ లిల్లీరాణి, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ఎపిడి వెలుగు రమణ, డిప్యూటీ ఎస్‌ఒ అప్పారావు, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్, పిఎంఆర్‌సి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైసిపి నియోజకవర్గ సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

కొద్దిరోజుల్లో భీమిలిలో సిఎం జగన్ మోహన్ రెడ్డి హాజరు కానున్న ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. పట్టణంలోని వెలంపేట సీతారామ కల్యాణం మండపంలో నిర్వహించనున్న సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిపిలు, జెసిఎస్ కన్వీనర్లు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు హాజరు కావాలని కోరారు.

ప్రయాణం సురక్షితం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రయాణం సురక్షితం, సుఖప్రదం కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలను స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం భద్రతా మాసోత్సవాల కరపత్రాలను విడుదల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు జరుగుతాయన్నారు. రహదారి భద్రతాపై ప్రతి ఒక్కరూ విధిగా అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. రహదారి భద్రత నియమాలు పాటించాలని, కుటుంబాన్ని, ఆత్మీయులను గుర్తు పెట్టుకోవాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నిర్దేశిత తేదీల్లో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈనెల 22న రహదారి భద్రతపై వాలంటీర్లను గుర్తించి పార్వతీపురం, సాలూరు, పాలకొండలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో రహదారులపై గల బ్లాక్ స్పాట్‌పై పార్వతీపురంలో చర్చిస్తామని, ఈనెల 25, 27 తేదీలలో సాలూరు, పాలకొండలలో ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లతో రహదారి భద్రతాపై అవగాహనా వాక్ థాన్, 29న పార్వతీపురంలో డ్రైవర్లకు ఆరోగ్య, నేత్ర పరీక్షలు, ఈనెల 30, 31తేదీల్లో పార్వతీపురం, సాలూరు, పాలకొండలో విద్యా సంస్థల నిర్వాహకులు,

రహదారి భద్రత వారోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

డ్రైవర్లు, సరుకు రవాణా డ్రైవర్లకు అవగాహనా సదస్సులు, ఫిబ్రవరి 1 నుండి 3 వరకు పార్వతీపురం, సాలూరు, పాలకొండలలో మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వలన అనర్థాలు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల అనార్థాలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ద్విచక్ర వాహనర్యాలీ, 5,6 తేదీల్లో పార్వతీపురంలో ఆపదలో ఆదుకునే చట్టాలపై అవగాహన, 8, 9 తేదీల్లో పార్వతీపురం, సాలూరులో ఆటోమొబైల్ డీలర్లను భాగస్వామ్యం చేస్తూ ఆటో డ్రైవర్లకు అవగాహన, 12న పార్వతీపురంలో మోటారు వాహనాల చట్టం కింద రహదారి భద్రత నియమాలపై అవగాహన, 13న సాలూరులో ఆర్‌టిసి, మాక్సీ కాబ్, మోటార్ కాబ్ తదితర ప్రజా రవాణా సాధనాల డ్రైవర్లు, యాజమాన్యాల భాగస్వామ్యంతో మహిళలకు అవగాహన, 14,15 తేదీల్లో పార్వతీపురం, సాలూరులో మోటార్ వెహికల్ బీమాపై సదస్సులు, 16న పార్వతీపురం, సాలూరులో లారీ యాజమాన్యాలను భాగస్వామ్యం చేస్తూ సరుకు రవాణా వాహనాల డ్రైవర్లకు అవగాహన, 17న పాలకొండలో పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ నిర్వహణ, 19న పార్వతీపురంలో ముగింపు కార్యక్రమం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం శశి కుమార్, పరిపాలానాధికారి జి సీతారాం, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.రమేష్ కుమార్, జి.సత్యనారాయణ, ఎ.వర ప్రసాద్, బి.కాశీరామ్ నాయక్, వైద్యాధికారి హిరాయణ రావు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అత్యాచారం, కులదూషణ కేసులో ముద్దాయికి పదేళు కఠిన కారాగార శిక్ష, రూ. 10,000 జరిమానా న్యాయస్థానం విధించినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలను ఎస్‌పి వెల్లడించారు. గంగాపురానికి చెందిన బాధితురాలు తల్లిదండ్రులతో పాటు నివాసం ఉంటుంది. 8ఏళ్ల క్రితం పులిగుమ్మికి చెందిన పువ్వల పోలి అనే అతనితో వివాహం జరిగి కుమార్తె జన్మించింది, తాగుడుకు బానిసైన పోలి సరిగ్గా చూడకపోవడంతో తన కన్నవారి ఇంట్లో ఉంటున్నారు. ఇది ఉండగా అదే గ్రామానికి చెందిన పిరిడి అనే వ్యక్తి పరిచయమై రెండో భార్యగా స్వీకరించి, తన కుమార్తెను సక్రమంగా చూసుకుంటానని నమ్మించి లోబర్చుకొని గర్భవతిని చేశాడు. ఈ క్రమంలో అబ్బాయి పుట్టగా సదరు విషయం చెప్పగా తను చూడ్డానికి రాకపోవడంతో జరిగిన విషయాన్ని తన తల్లి దండ్రులకు, పెద్దలతో చెప్పి పంచాయతీ పెట్టింది. ఈ విషయం తెలుసుకొని నేరస్తుడు గ్రామం విడిచి వెళ్లిపోయాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అతనిపై కేసు నమోదు చేసి ఎస్‌టి సెల్ దర్యాప్తు అధికారి బి.మోహనరావు దర్యాప్తు చేసి, ముద్దాయిని అరెస్టు చేసి వివరాలను కోర్టుకు సమర్పించారు. నేరం రుజువు కావడంతో అదనపు జిల్లా జడ్జి కోర్టు జడ్జి షేక్ సికిందర్ బాషా ముద్దాయికి పదేళ్ళ జైలు, రూ.10వేలు జరిమానా వేధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో చొరవ చూపిన పోలీసు అధికారులను, కోర్టు కానిస్టేబుల్‌ను ఎస్‌పి అభినందించారు.

రైళ్ల రద్దుతో బస్సులకు రద్దీ

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సంక్రాంతి పండగ ముగియడంతో పండగకు వచ్చే ప్రతి ఒక్కరూ తిరిగి తమ పిల్లా పాపలతో తమ స్వగ్రామాలకు, వలస ప్రాంతాలకు పయణమయ్యారు. పార్వతీపురం మీదుగా వెళ్లే అన్ని ట్రైన్‌లు మూడో లైను ట్రాక్ నిర్మాణంలో భాగంగా రద్దు కావడంతో ప్రయాణికులు బస్సులను ఆశ్రయించాల్సి వచ్చింది. దీంతో ప్రయాణికులకు ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో సరిపడా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుకునేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. పండగల రోజులలో కూడా ఆర్‌టిసి అధికారులు ప్రయాణికుల కోసం అదనపు బస్సులు ఏర్పాటు చేయకపోవడం ఏమిటని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

24న మార్కెట్ ఆశీల వేలం

ప్రజాశక్తి.. పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి రోజువారీ మార్కెట్, మున్సిపాల్టీ పరిధిలో గల పలు ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్ ఆశీలు వసూలు చేసుకునేందుకు మున్సిపల్ మార్కెట్ ఆశీలు వేలంపాట ఈనెల 24న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగుతుందని మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బారూబెను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహిస్తామన్నారు. మార్కెట్ ఆశీలు వేలంపాటలో పాల్గొనేవారు రూ.5లక్షలు సాల్విన్ సర్టిఫికేట్‌తో పాటు రూ.4 లక్షలు ధరావత్తు మునిసిపల్ రెవెన్యూ అధికారులకు అందజేసి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

విగ్రహావిష్కరణలు ఎవరి కోసం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనం దాగివుందో తెలుసుకోలేనంత కాలం జనం మోసపోతూ ఉంటారని లెనిన్ మహాశయుడు శతాబ్ధకాలం క్రితమే ఉద్భోదించాడు. నేడు ఆయన మాటలను గుర్తుచేస్తున్నారు చాలా మంది ప్రజా దృక్కోణంగల రాజకీయ విశ్లేషకులు, మేథావులు, ప్రజాసంఘాల నాయకులు. ఇందుకు కారణం లేకపోలేదు. ఇటీవల జిల్లాలో అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలు, పూలదండల అలంకరణ కాస్తా ఎక్కువైంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు మునుపెన్నడూ లేనంతగా హడావుడి చేస్తున్నాయి. వైసిపి అయితే రాష్ట్ర రాజధానిలో రూ.4వందల కోట్లతో పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసి, దాన్ని ఆవిష్కరించింది. బహుశా అందుకేనేమో ఆ పార్టీ జిల్లాలో కూడా కొద్ది రోజులుగా అటువంటి హడావుడి చేస్తోంది. మేమేం తక్కువ కాదన్నట్టు టిడిపి కూడా తన వంతు కార్యక్రమాలు ముమ్మరం చేస్తోంది. అంతమాత్రాన దీనికి రాజకీయ రంగు పులిమేయాలా అనుకుంటే పొరపాటే. కానీ, దశాబ్ధాలు తరబడి రాష్ట్రాన్ని ఏలిన అధికార, ప్రతిపక్ష పార్టీలు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు, అమలుకు ఏమేరకు ప్రయత్నిస్తున్నాయన్నదానిపై మాత్రం సర్వత్రా చర్చనడుస్తోంది. వాస్తవానికి అంబేద్కర్‌ను గుర్తు చేసుకుంటే అందులో మూల స్తంభాలుగావున్న ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమైక్యవాదం, దేశ ఆర్థిక స్వావలంభన ఎవరికైనా గుర్తుకు రాకమానవు. కానీ, వాటి అమలు మన జిల్లాలో ఏమేరకు అమలవుతోంది. ఇప్పటికీ అంటరానితనం వెంటాడుతోంది. జిల్లాలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోంది. చదువు, విద్యలో ఇంకా వెనుకబాటు ఉంది. అంతెందుకు ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు ఉన్నప్పటికీ తీరా ఎన్నికయ్యాక ప్రజాప్రతినిధిగా తన అధికారాన్ని ఉపయోగించుకునే స్వేచ్ఛగానీ, బాధ్యతలు నెరవేర్చగలిగే అవకాశంగా ఉందా? అని జనం



చర్చించుకుంటున్నారు. ఇదే జరిగి ఉండి వుంటే గిరిజన గ్రామాలు కనీసం రహదారులకు కూడా ఎందుకు నోచుకోలేదు. నిన్నగాక మొన్న ఎస్.కోట ఏజెన్సీలో దారిలేక డోలిమోతతో సర్కారు దవాఖానాకు ఎందుకు వెళ్లాల్సివచ్చింది. మార్గం మధ్యలో ప్రాణం పోతే, చివరికి మృతదేహాన్నిమోటార్ సైకిల్‌పై ఎందుకు తీసుకెళాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణాల్లో సైతం దళితులు ఇంకా ఎందుకు మురికివాడల్లో మగ్గాల్సిన దుస్థితి ఏర్పడింది. అంబేద్కర్ చూపిన స్వేచ్ఛ, సమానత్వం పాలకపార్టీలు అమలు చేసి ఉంటే ఈ దుస్థితి ఏర్పడేదా? అన్నది పబ్లిక్ టాక్. ఈ మాట కొస్తే దేశంలోని బిజెపి ప్రభుత్వం మత కలహాలు సృష్టిస్తోందని, మత ప్రాతిపదికన జనాన్ని విభజిస్తోందని అనేక మంది మేథావులు, రాజకీయ పార్టీలు అంటున్నారు. అటువంటి ప్రయత్నం మన రాష్ట్రంలోనూ జరుగుతోంది. ముఖ్యంగా నూతన విద్యావిధానం పేరిట చేసిన సిలబస్ మార్పులో మతాన్ని పులుముతూ జాతీయవాదాన్ని దెబ్బతీసే అనేక అంశాలు చేర్చినట్టుగా మేథావులు విమర్శిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ విధానాన్ని అమలు చేసేందుకు కేరళ సహా చాలా రాష్ట్రాలు నిరాకరించాయి. కానీ, మన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంత ఉవ్విళ్లూగుతూ ఈ విధానం అమలు చేస్తోంది. టిడిపి ఎందుకు ప్రయత్నం చేయడం లేదు. దేశ ఆర్థిక స్వాలంభన దెబ్బతీసే విధంగా విశాఖ ఉక్కును విదేశీ కంపెనీకీ, విశాఖపోర్టును ఆదాని వంటి గుత్తపెట్టుబడిదారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తే వైసిపి ప్రభుత్వం ఎందుకు మాట్లాడడం లేదు. ప్రతిపక్ష టిడిపి ఎందుకు నోరు మెదపడం లేదు. ఇవన్నీ జనం నోట నుంచి వినిపిస్తున్న మాటలు. ఈనేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడినవారిని ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకే వైసిపి ప్రయత్నిస్తోందని, అందుకు ప్రతిపక్ష టిడిపి కూడా పోటీ పడడం తప్ప, జాతి సమగ్రతను కాపాడి, పేదరిక నిర్మూలన, స్వేచ్ఛ, సమానత్వం కోసం ప్రయత్నించడం లేదని ప్రజానీకంలో చర్చ జరుగుతోంది.



మాట్లాడుతున్న పిఒ విష్ణుచరణ్

పోలింగ్ కేంద్రాలను సందర్శించాలి

ప్రజాశక్తి - సాలూరు

పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు విధిగా ముందుగా సందర్శించాలని స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, సాలూరు నియోజక వర్గం ఓటరు నమోదు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై శనివారం ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో సంబంధిత తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులు విధిగా పోలింగ్ కేంద్రాలు సందర్శించాలని, అక్కడ మౌలిక సదుపాయాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. కనీస వసతులైన తాగునీరు, విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్లు తదితర వసతులు ఉండాలని అన్నారు. విద్యా శాఖ సంబంధిత పనులు చేపడుతుందని, సమన్వయం చేయాలని ఆయన సూచించారు. సెక్టార్ అధికారులు రూటు పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న ఎడి నిర్మల జ్యోతి

ఎరువుల దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి- సీతానగరం

మండల కేంద్రం లోని ఎరువుల దుకాణాలను గుమ్మలక్ష్మీపురం ఎడిఎ అలజంగి నిర్మల జ్యోతి, ఎఒ అవినాష్‌తో కలిసి శనివారం తనిఖీ చేసి దస్త్రాలను, ఎరువుల నిల్వలను పరిశీలించారు. దుకాణాదారులకు స్టాక్ వివరాలను దుకాణం బయట పొందు పరచాలని తెలియజేశారు. స్టోరేజ్ అగ్రిమెంట్లు, జిఎస్‌టి వివరాలు లైసెన్సులు, బిల్ బుక్కులు, రైతు సంతకాలు కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు. నిర్దేశిత ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. ఈ తనిఖీల్లో ఎరువుల దుకాణాలు యజమానులు పాల్గొన్నారు.

'తెలగ'ను బిసిలో చేర్చాలని వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తెలగ కులాన్ని బిసిలో చేర్చాలని గుమ్మలక్ష్మీపురం తెలగ సంఘం నాయకులు తహశీల్దార్ రాములమ్మకు వినతిపత్రం సమర్పించారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న తెలగ కులాన్ని బిసిల్లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతి పత్రాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలగ సంఘం నాయకులు ఎర్నాకుల నాగరాజు, పైడా జగదీశ్వరరావు, అత్తిలి శ్రీనివాసరావు, మేడిద గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మరుపెంటలో జాతర రద్దు

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని మరుపెంటలో 2020 వరకు ప్రతి ఏటా శంబర పోలమ్మ జాతరను గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామలు ఘనంగా నిర్వహించేవారు. ఈ సంబరాన్ని అంబరమంటేలా నిర్వహించేవారు. అయితే మాయదారి కరోనా వచ్చినప్పటి నుంచి మరుపెంట గ్రామస్తులు, పెద్దలు ఏకతాటిపై నిలబడి గడిచిన మూడేళ్ల నుంచి శంబర పోలమ్మ జాతరను నిర్వహించడంలో వెనకడుగు వేస్తున్నారు. రానున్న కాలంలో కూడా ఈ పండగను నిర్వహించలేమని చెబుతున్నారు. అందుకు అధికారులు, భక్తులు యావన్మంది గ్రహించి మక్కువ మండలం శంబరలో నిర్వహిస్తున్న పోలమ్మ జాతరను దృష్టిలో పెట్టుకుని తమ మొక్కులను తీర్చుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ప్రాథమిక వైద్యంపై శిక్షణ

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రాథమిక వైద్యంపై గిరిజన ప్రాంతాల్లో యువతీ, యువకులకు ఈనెల 22,23 తేదీల్లో పార్వతీపురం రాజా హిందీ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణలో ప్రథమ చికిత్స ఎలా చేయాలి? ఇంజక్షన్ ఎలా వేయాలని, గుండె పోటు వచ్చేటప్పుడు ప్రాథమికంగా ఎలా స్పందించాలి తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు ప్రారంభిస్తారని నిర్వహకులు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో యువత శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9494916182 నెంబర్ కు సంప్రదించాలని సూచించారు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో పాటు ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడండి

ప్రజాశక్తి - సీతానగరం

నేటికాలంలో ప్రకతి వ్యవసాయ ఉత్పత్తులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోండని జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మానస, తిరుపతి, దేవీప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట బందలుప్పి రైతులు సాగుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు అమ్మకాలు కార్యక్రమాన్ని చేపట్టారు. రైతు నుంచి నేరుగా కొనుగోలు చేయడం వల్ల రైతుకు లాభంతో పాటు వినియోగదారులకు కూడా లాభం ఉంటుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రైతు సాధికారిక సంస్థ ప్రకృతి వ్యవసాయసాగుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది దానబాబు, గంగరాజు,రైతులు, ఐసిఅర్పీలు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ అధికారి సందర్శన

ప్రజాశక్తి- మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ జాతర ఈ నెల 22,23న జరగనున్న నేపథ్యంలో ఆలయాన్ని శనివారం రాత్రి జిల్లా దేవాదయశాఖ అధికారి డివివి ప్రసాద్‌రావు సందర్శించారు. జాతరకు ఏర్పాట్లను ఆలయ ఇఒ వివిఎస్ నారాయణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యూలైన్లను పర్యవేక్షించి తగు సూచనలు చేశారు.

ఆలయ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రసాదరావు

మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి ప్రాజెక్ట్ ఎడమ కాలువ వద్ద శనివారం మహిళా మృతదేహం గుర్తించినట్లు ట్రైనీ డిఎస్‌పి అజిజ్ తెలిపారు. మృతదేహం కొమరాడకు చెందిన వారణాసి కుమార్ కుమార్తె వారణాసి పద్మజ(24) గా గుర్తించినట్లు తెలిపారు. ఆమె మృతికి ప్రేమ వ్యవహారం కారణమని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. .

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- పాచిపెంట

పాచిపెంటకు చెందిన బవి రెడ్డి పవన్ కుమార్ సాలూరు నుండి శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన పవన్‌కుమార్‌ను కుటుంబీకులు సాలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు

ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పవన్

కదలని జలజీవన్ మిషన్ పనులు

- గ్రామాల్లో పడకేసిన పథకం
- నిధుల్లేక నిలిచిపోయిన పనులు
- ప్రజలకు అందని తాగునీరు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గ్రామాలు దేశానికీ పట్టుకొమ్మలు అని, దేశాభివృద్ధి అనేది గ్రామాల వల్లే సాధ్యమని చెప్పే నాయకులు మాటలు నీటిమూటలవుతున్నాయి. నాయకులు మాటలు ప్రసంగాలకే పరిమితమని పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏ పల్లె చూసినా ఏమున్నది గర్వకారణం కుంటూ బోయిన అభివృద్ధి తప్పా అని ప్రజలు కోడై కూస్తున్నారు. పంటలు పండడానికైనా ప్రజల ఆరోగ్యంగా ఉండడానికైనా ఎలాంటి రోగాలు ప్రబలకుండా ఉండాలంటే నీరు ముఖ్యమని అందరికీ తెలిసిందే. అటువంటి నీటిని అందరికీ అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇంటింటికీ మంచినీటిని అందించాలని సంకల్పించింది. అయితే సంకల్పం మంచిదే అయిన క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం నీరుగారిపోతుందని పలువురు ఆక్షేపిస్తున్నారు.

మండలంలో 56 గ్రామాలు ఉండగా 13 సచివాలయాలను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జలజీవన్ మీసన్ ద్వారా నందివానివలస, తోటపల్లి, శివరాంపురం, సీతారాంపురం, కారివలస, పిట్టలమెట్ట గ్రామాలలో పూర్తి స్థాయిలో కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటు చేసినప్పటికి పూర్తి స్థాయిలో నీరందక ప్రజలుకు పాట్లు తప్పడం లేదు.

కొత్తపల్లి గ్రామంలో నీరు రాని కులాయి లైన్లు ఇవే

నత్తనడకన పనులు

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో 20 లక్షలు రూపాయలు వ్యయంతో పనులు చేపట్టినప్పటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేసి నిరీవ్వడం మానేశారు. దీంతో కుళాయిలు దిష్టిబొమ్మల మాదిరిగా ఇంటి ముందున్నాయే తప్ప నీరు వచ్చే దాఖలాలు లేవు అని గ్రామ ప్రజలు వాపోతున్నారు. బురదవేంకటాపురం గ్రామంలో కొన్ని వీధుల్లో కుళాయి కోసం తవ్వి పనులు పూర్తి చేయకుండానే వాటిని మళ్ళీ పూడ్చి వేసిన సంఘటన చోటు చేసుకుంది. కొన్ని గ్రామాలలో పనులు కూడా ప్రారంభం కాక ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు.

మూలకు చేరిన పైపులు

కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులు ద్వారా లక్షలు రూపాయలు పెట్టి కొనుగోలు చేయసిన పైపులను సకాలంలో వినియోగించకపోవడంతో ఎక్కడికక్కడ పడి ఉన్నాయి. అంచనాకు మించి వ్యయం కావడంతో పనిచేసినా సకాలంలో బిల్లులు అందక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

హామీలు నీటి మూటలే

మండలంలో అన్ని పంచాయతీలకు ఇంటింటి కుళాయి కనెక్షన్ మంజూరైనప్పటికీ కొన్ని గ్రామాలు తప్పా మిగిలిన గ్రామాల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్ మాటలు నీటి మూటగా మిగిలింది. వేసవి కాలం మొదలు కావస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేసి కుళాయి కనెక్షన్‌లను ప్రతి ఇంటికి ఇచ్చి తాగునీటిని సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.

మరుపెంట గ్రామంలో వృథాగా ఉన్న పైపులు

ప్రజలలో అసంతృప్తి

అసంపూర్తి పనులతో అర్ధాంతరంగా వదిలేసిన పైపులైన్లు మళ్ళీ పునరుద్ధరించి ప్రతి ఇంటికి నీరు అందించే విధంగా కృషి చేయాలని. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికీ ఈ జలజీవన్ మిషన్ పనులు నిలువుటద్దంగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ఉంది.

అంబటి రామకృష్ణ, పిట్టల మెట్ట.

ఇప్పటికే కొన్ని పనులు చేశాం

మండలంలో కొన్ని గ్రామాలలో ఇప్పటికే ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేశాం. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కొన్ని గ్రామాలలో పనులు కోసం టెండర్ పిలుస్తున్నాం. వేసవి నాటికి ప్రతి గ్రామంలో తాగునీటిని అందించేందుకు ప్రయత్నం చేస్తాం.

గౌరీ శంకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, గరుగుబిల్లి.

ఆరోగ్య సమస్యలపై స్పష్టత అవసరం

ప్రజాశక్తి- సీతానగరం

ప్రజల ఆరోగ్య సమస్యలపై వైద్యులకు స్పష్టత అవసరమని, స్పష్టంగా తెలుసుకొని కచ్చితమైన ఆరోగ్య తనిఖీలు, రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. శనివారం సీతానగరం పిహెచ్‌సి, పెదభోగిలలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఒపి నిర్వహణ రికార్డులలో నమోదు చేసిన ఆరోగ్య సమస్యలను ఆయన నిశితంగా పరిశీలించి వివరాలు స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. జ్వర సమస్య నమోదును పరిశీలించి చేపట్టిన నిర్ధారణ పరీక్షలు, ఫలితాలు, చికిత్స వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ల్యాబ్‌లో పరీక్షల రికార్డులు, నివేదికలు తనిఖీ చేశారు. ప్రధాన రహదారికి చాలా సమీపంగా ఉన్న నేపథ్యంలో పిహెచ్‌సిలో అత్యవసర చికిత్సకు అవసరమైన మందులు, పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. పిహెచ్‌సిలో వ్యాక్సిన్ నిల్వలు తనిఖీ చేసి ఉపయోగిస్తున్న వయల్స్ పై తేదీలను వైద్య సిబ్బంది స్పష్టంగా నమోదు చేయాలన్నారు. వైద్య శిబిరంలో ఉన్న ప్రజలతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పావని, సిహెచ్‌ఒ ఎస్వీ రమణ, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంఒ

చర్మవ్యాధి నిపుణుల సేవలు వినియోగించుకోవాలి

సీతంపేట: స్థానిక ఏరియా ఆసుపత్రిలో చర్మ వ్యాధి నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సీతంపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. శ్రీనివాసరావు కోరారు. శనివారం చర్మ వ్యాధి నిపుణులు ఉద్యోగ భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏరియా ఆసుపత్రిలో డెర్మటాలాజిస్ట్ ఎండిని నియమించడం ఇదే మొదటి సారని తెలిపారు. ఇప్పటికే అన్ని వ్యాధులకు సంబంధించిన స్పెషలిస్టులను ప్రభుత్వం నియమించిందని వారందరి సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరం ఉన్న అన్నిరకాల మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 24గంటలు రోగులకు వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. శ్రీనివారావు తో పాటు వైద్యాధికారులు సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన జవహర్ నవోదయ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఇఒ ఆర్ ఆనందరావు తెలిపారు. జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 156 మంది విద్యార్థులు హాజరు కావలసినప్పటికీ 20 మంది విద్యార్థులు హాజరు కాలేదని, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 168 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉన్నప్పటికీ 21 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఆయన తెలిపారు. వెన్నెల వలస జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ డి పరశురామయ్య పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్లు ఎస్ సుంబోరా, కెపి నాగమణి, సిఎల్‌ఒలు ఆర్ సాయిలక్ష్మి, పి వంశీధర్‌లు పాల్గొన్నారు.

విద్యుత్తు సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కళాశాల ప్రిన్సిపల్ పోయి నాగేశ్వరరావు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్లో ఎఇ వెంకటరమణను కలిసి కళాశా లకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ విద్యుత్ కలెక్షన్‌కు సంబంధించిన డిడిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీకి నాడు నేడు ద్వారా వచ్చిన ఆర్‌ఒ ప్లాంట్లు రెండు త్రీఫేస్ కరెంట్ లేక సరిగా పనిచేయడం లేదన్నారు. దీనికోసం విద్యుత్‌శాఖ అధికారులకు లేఖ పెడితే వారు రూ.లక్షా308 డిడి తీయమని లిఖితపూర్వకంగా ఎస్టిమేషన్ ఇచ్చారన్నారు. అంత డబ్బు స్పెషల్ ఫీజులో తీయడం కోసం కమిషనర్‌కు ప్రతిపాదనలను ఈనెల 1న పంపించామన్నారు. మంజూరై వచ్చేసరికి కాలయాపన అవుతుందన్నారు తమ కాలేజీకి చెందిన గణిత అధ్యాపకులు కె.అప్పలనాయుడు మాస్టారు తన శిష్యులకు ఈ విషయమై వాట్సాప్ ద్వారా తెలియపర్చగా, వారంతా సహకరించి త్రీఫేస్ కరెంటు వేయడానికి సరిపడిన అమౌంట్ నాలుగు రోజుల్లో అతని అకౌంట్‌కు పంపించారని తెలిపారు. ఆ డబ్బుతో వెంటనే డిడి తీశామన్నారు. దీంతో మూడు రోజుల్లో త్రీఫేస్ కరెంట్ కళాశాలకు ఇస్తామని అధికారులు తెలిపారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన కాంట్రాక్టు లెక్చరర్ అప్పలనాయుడును ప్రిన్సిపల్ అభినందించారు.

మా ఊర్లో పాఠశాల ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని తాలాడ పంచాయతీ లంగడుగూడలో నారీశక్తి తెలుగుదేశం నాయకులు పడాల భూదేవి ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆగ్రామస్తులు తమ సమస్యలను ఆమెకు వద్ద వెళ్లబుచ్చుకున్నారు. తమ పిల్లలు చదువుకోడానికి పాఠశాల ఏర్పాటు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామంలో పాఠశాలలో పాఠశాల లేకపోవడంతో పిల్లలంతా రెండున్నర కిలోమీటర్లు అడవిలో నడుచుకుంటూ మూర్తకాడిగూడకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పిల్లలు అంత దూరం వెళ్లలేక మధ్యలోనే చదువులు మానేస్తున్నారన్నారు. మా గ్రామంలో ఐదేళ్ల దాటిన పిల్లలు 20 మందికి పైగా ఉన్నారని తెలిపారు. పాఠశాల ఏర్పాటు చేయమని ప్రభుత్వానికి పలుమార్లు విన్నపాలు చేసినా బుట్టదాఖలయ్యాయని తెలిపారు. స్థానిక నాయకులు, అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అలాగే కనీస మౌలిక సౌకర్యాలు కూడా లేవన్నారు. అనంతరం భూదేవి మాట్లాడుతూ పిల్లలు చదువుకోడానికి పాఠశాల ఏర్పాటు చేయమని గిరిజనులు కోరుకోవడం మన దౌర్భాగ్యమన్నారు. విద్యా హక్కు చట్టం ఉన్నప్పటికీ ప్రభుత్వాలు కాలరాస్తూ మన హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. కనీసం తాగునీరు కూడా లేని దీనస్థితిలో మన గిరిజన గ్రామాలున్నాయని, గ్రామానికి సరైన రోడ్డు కూడా లేదన్నారు. ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో భూదేవితో పాటు మాజీ ఎంపిటిసి బిడ్డిక జయలక్ష్మి, సీతంపేట వార్డుసభ్యులు ఊయక సుమలత, సవర వీరన్న, సవర గంగయ్య, సవర రాజు, సవర దుర్గాప్రసాద్, సవర మొఖలింగం, తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న పడాల భూదేవి

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

సూపరింటెండెంట్ రవీంద్రకుమార్

ప్రజాశక్తి - వీరఘట్టం

రక్తదానం చేయండి... ఓ ముగ్గురి ప్రాణాలు కాపాడి వాళ్ళ అవుతారని పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.రవీంద్ర కుమార్ యువకులకు సూచించారు. మండలంలోని పనసనందివాడలో మాజీ సర్పంచ్ కె.సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలకు ఒకసారి రక్తాన్ని దానం చేస్తే ఎంతోమంది ప్రాణాలు నిలబెట్టిన వారవుతారన్నారు. అదేవిధంగా రక్తాన్ని దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని యువతకు సూచించారు. మిమ్మల్ని బట్టి పక్క ఊళ్లో వాళ్లు కూడా మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొని రక్తాన్ని దానం చేసేందుకు ముందుకు వస్తారని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాగే గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ చెత్తాచెదారాలు ఉన్నా సామాజిక బాధ్యత తీసుకుని వాటిని తొలగించి గ్రామం పరిశుభ్రంగా ఉండడంతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యవంతులుగా ఉంటారని యువతకు సూచించారు. ఈ సందర్భంగా రక్తం దానం చేసేందుకు 25 మంది యువకులు ముందుకు రావడంతో వారిని అభినందించారు. అనంతరం సర్టిఫికెట్లు, పండ్లు తదితరమైనవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మానస, ఎంపిటిసి సభ్యులు బొమ్మలి ప్రకాష్ రావు, జీవరత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికేట్లను పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ రవీంద్రకుమార్

ఉద్యోగార్థులకు వరం.. అభిలాష

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో యువత పోటీ పరీక్షల్లో పాల్గొని తమ సత్తా నిరూపించుకునేందుకు తోడ్పడేలా సచివాలయ భవనాల్లో మినీ గ్రంథాలయాలు ఏర్పాటు చేసి విలువైన పుస్తకాలు అందజేయాలని ఆలోచనతో కలెక్టర్ నిశాంత్ కుమార్ మదిలో మెదిలిన ఒక ఆలోచన. ఈ మేరకు అభిలాష పేరుతో ప్రారంభించిన మినీ గ్రంథాలయాలు ఏర్పాటు యువతను ఎంతగానో ఆకర్షిస్తుంది. జిల్లాలో 97 గ్రామ సచివాలయాల్లో ఈ గ్రంథాలయాలు ప్రారంభమయ్యాయి. యువతను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నాయి. అభిలాష గ్రంథాలయాల్లో 66 రకాల 12,804 పుస్తకాలు ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఈ అభిలాష సామాజిక గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. యువతకు మంచి పుస్తకాలు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేయడం జరిగింది. సివిల్స్, గ్రూప్ 1,2. యుపి ఎస్ సి, ఎన్నిఇఆర్టి, ఆర్ఆర్‌బి, బ్యాంకింగ్, జెఇఇ, నీట్ తదితర పరీక్షలకు అవసరం అయ్యే పుస్తకాలను ఈ గ్రంథాలయాల్లో ఏర్పాటు చేశారు.

అభిలాష గ్రంథాలయాల్లో యువత తమ ఆసక్తి గల పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను పెద్ద ఎత్తున ఉపయోగించుకొంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అభిలాషతో తమ అభిలాష, అభిరుచి నెరవేరనుందన్నారు. వీరఘట్టం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, సాలూరు తదితర మండలాల్లో మారుమూల సచివాలయాల్లో సైతం అభ్యర్థులు ఈ అవకాశం ఉపయోగించుకుంటున్నారు.

అభిలాష పుస్తకాన్ని అందిస్తున్న సచివాలయ సిబ్బంది

మండల స్థాయి విజేతలు వీరే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలలో విజేతలను శనివారం పార్వతీపురం ఎంపిడిఒ అకిబ్ జావేద్ ప్రకటించారు. వాలీబాల్ అడ్డాపుసిల గ్రామ సచివాలయం, కబడ్డీ కొత్త బెలగాం, క్రికెట్ పార్వతీపురం టౌన్ రాజు గారి కోట, కోకో ఎమ్మార్ నగరం, షటిల్ బ్యాడ్మింటన్ బెల్గాం రెండవ వార్డ్ సచివాలయం నుండి ఆ ఆటకు సంబంధించిన బృందాలు విజేతలుగా నిలిచాయని వీరు నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో గెలుపొందిన విజేతలు ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 10 నుంచి 20 వరకు నిర్వహించిన గెలుపొందిన వారికి జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం విజేతల జాబితాను ప్రకటించారు. అందులో మండల స్థాయిలో క్రికెట్ పోటీల్లో జానిమూలవలసకు చెందిన టీం, కబడ్డీలో సూరంపేట, వాలీబాల్ లచ్చి పేట, బ్యాడ్మింటన్ పెద్దబోగిలి, ఖోఖో జోగింపేట సచివాలయాలకు చెందిన యువతకులు గెలుపొందినట్లు ప్రకటించారు. వీరంతా నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కుమార్ వర్మ, వివిధ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భామిని: ఆడుదాం -ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా, మండల స్థాయి క్రికెట్ పోటీల్లో భామిని జట్టు విజేతగా నిలిచి, నియోజకవర్గ స్థాయిలో పోటీపడనుంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో మండల స్థాయి క్రికెట్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన భామిని, వడ్డాంగి జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. నిర్ణీత 12 ఓవర్లలో వడ్డంగి జట్టు 9 ఓవర్లకు 60 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బాటింగ్ చేసిన భామిని 10 ఓవర్లలో 61 పరుగులు చేసి విజేతగా నిలిచింది. మండల స్థాయి విజేతగా నిలిచిన భామిని జట్టును ఎంపిడిఒ జీలకర్ర ఉమామహేశ్వరి అభినందిస్తూ నియోజకవర్గ స్థాయిలో విజేతగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో భామిని జట్టు కెప్టెన్ పి.కిశోర్, వైస్ కెప్టెన్ ఉమశంకర్, జూనియర్ అసిస్టెంట్ సోమేశ్, భామిని డిజిటల్ అసిస్టెంట్ వున్నారు.

వీరఘట్టం: క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ శ్వేత

క్రీడల్లో రాణించాలి

వీరఘట్టం: చదువులతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంపిడిఒ డి. శ్వేత క్రీడాకారులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో క్రీడాకారులకు క్రీడ పరికరాలు పంపిణీ చేశారు. గెలుపోటములు సహజమేనని వాటిని దృష్టిలో పెట్టుకోకుండా క్రీడలు పైన దృష్టి పెట్టాలన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 ,19 ,20 తేదీ నుండి మండల స్థాయి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, కోకో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్ ఉమామహేశ్వరరావు, ఎస్ పద్మరాజు, కే సాల్మన్‌రాజు, ఎం రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

పిల్లల ఆచూకీ కోసం చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తప్పిపోయిన పిల్లల ఆచూకీ కోసం చర్యలు చేపట్టాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలు, మహిళలపై ప్రత్యేక దృష్టి సారించి విచారణ పక్కాగా చేయాలన్నారు. మహిళలను వివిధ మార్గాల్లో నమ్మించి మోసం చేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయని వాటిపై నిఘా ఉండాలని సూచించారు. దేశ విదేశాలకు అక్రమ రవాణా వంటి అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సైబర్ క్రైమ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడం అవసంమని ఆయన పేర్కొన్నారు. సమావే శంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమే ష్, శిక్షణ డిఎస్‌పి ఎండి అజీజ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్.దామోదరరావు

మహారాజశ్రీ బొబ్బిలి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS. 45/2018

Between:మజ్జి అప్పల నర్సమ్మ
బెజ్జిపురపు శ్రీదేవి ...వాదులు
And:
గుగ్గిలాపు చిన్న అప్పిశెట్టి (Died) వగైరాలు ...ప్రతివాదులు
To,
D-6: గుగ్గిలాపు శంకర్రావు, S/o లేటు అప్పన్న పెద్దింపేట గ్రామం, బల్జిపేట మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.
D-8: చింతాడు గౌరమ్మ, W/o పరశురాములు D/o లేటు గుగ్గిలాపు అప్పన్న ప్రస్తుతం పెద్దింపేట గ్రామం. (--Rest dito--)

పై నెంబర్ దావా షెడ్యూల్ దాఖలా ఆస్తులపై 1,2 ప్రతివాదులు పై ఇంజక్షన్ డిక్రీ కోరుతూ వాదులు యిదావా దాఖలు చేసి ఉన్నారు. యిందిలి 1,2 ప్రతివాదులు కాలం చేసినందున వారి యొక్క వారసులు మీరు అయినందున కోర్టు వారు మీకు దావా నోటీసులు పంపించి ఉన్నారు. కానీ మీరు తీసుకొని యుండుట లేదు పై నెంబర్ దావా **తే24-01-2024దీకి వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా తేదీ ఉదయం 10:30 గం॥లకు** పైకోర్టులో స్వయంగా గాని, మీ వకీల్ ద్వారా గాని హాజరై వ్రాత పూర్వకంగా మీ యొక్క వాదనను దాఖలు చేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మాణం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఆర్డర్ ప్రకారం //

ఎం. జగన్నాథరావు
వాది తరపు న్యాయవాది, బొబ్బిలి,
ఫోన్: 9440399344.